

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం


18 జనవరి 2026 పేజీలు : 08


# వణికిస్తున్న జ్వరం







- ప్రతి గ్రామంలో జ్వర బాధితులు
- పట్టణాలకు పరుగులు


నెల్లూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :

నెల్లూరు జిల్లాలో జ్వరం విజృంభించింది. పల్లెలు, పట్టణాలని తేడా లేకుండా.. ఎక్కడ చూసినా జ్వర బాధితులే. ఎన్ని మందులు వాడినా, జ్వరం అదుపులోకి రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నట్టుండి అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. అది కూడా 100 నుంచి 101 డిగ్రీల పైనే టెంపరేచర్ ఉంటుంది. దీనికితోడు తీవ్రమైన ఒళ్లు నొప్పులు, మంచం మీద నుంచి కూడా లేవలేని పరిస్థితి. కొంత మందికి వాంతులు.. మరికొంత మందికి జలుబు, దగ్గు, తీవ్రమైన తలనొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలా మందికి అకస్మాత్తుగా ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. దీంతో బాధితులు పట్టణాల్లోని ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

రక్తపరీక్షలు చేయించినా.. నిర్దిష్టమైన కారణాలు తెలియడం లేదు. కొంత మందిలో డెంగీ లక్షణాలు, మరికొంత మందిలో చికెన్ గున్యా, డయేరియా, టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ జ్వరాలు ఏమిటన్న దానిపై డాక్టర్లకు కూడా అంతుపట్టడం లేదు. ప్రతి గ్రామంలో వింత వైరస్ విజృంభించడంతో విచిత్ర లక్షణాలతో ప్రజలు తీవ్ర అనారోగ్యం బారినపడుతున్నారు. రక్త పరీక్షలకే వేలాది రూపాయలు అవుతున్నాయి. కొంత మందికి ప్లేట్‌లెట్స్ తగ్గుతుండడంతో ఆసుపత్రుల్లో అడ్మిట్ అవుతున్నారు. కొన్నిచోట్ల మందులు వాడుతున్నా.. రోగాలు అదుపులోకి రావడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి.

## రాబందుల్లా హాస్పిటల్స్ :

జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాల్లో ఆసుపత్రులు ప్రజలను దోచుకు తింటున్నాయి. అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రికి వెళితే చాలు అన్ని రక్త పరీక్షలు చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకపోయినా రక్తపరీక్షలు చేస్తుండడంతో రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయి. అపు చేసి హాస్పిటల్‌కు వస్తే.. డాక్టర్ దగ్గరకు వెళ్లేసరికే తెచ్చుకున్న డబ్బులు అయిపోతుండడంతో మళ్లీ నగదు కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి. కొంతమంది డాక్టర్లు అయితే పరీక్షలు చేయిస్తేనే జబ్బు ఏమిటో తెలుస్తుందని, చేయకుంటే తాము ఏమి మందులు రాసివ్వాలని తిరిగి వెనక్కు పంపిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక పరీక్షలకే వేలకు వేల రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తుంది.



## రూ.వేలల్లో అద్దెలు :

వారంరోజులు జ్వరం తగ్గలేదంటే ఇక మరో మాట లేదు.. అడ్మిట్ చేయాల్సిందే. ఇక అంతే రోజూ వేలకు వేలు బిల్లులు కట్టాల్సిందే. పెద్దపెద్ద నగరాల్లో ఏసీ లాడ్జీల్లో కూడా ఉండవు హాస్పిటల్‌లో రూముల ధరలు. మెడిసిన్, ఫీజుల కంటే రూము అద్దెలు ఎక్కువ అవుతున్నాయి. ఆసుపత్రి స్థాయిని బట్టి నాన్ ఏసీ రూము రోజుకు రూ.3 నుంచి రూ.4 వేలు, ఏసీ రూము అయితే రోజుకు 4 నుంచి 5 వేల రూపాయలు.. ఇదీ నెల్లూరులో పొగతోటలోని

-మిగతా 2లో

# ఎస్‌డీపీఓగా ఐపీఎస్ అధికారి దీక్ష



నెల్లూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :

నెల్లూరు ఎస్‌డీపీఓగా ఐపీఎస్ అధికారి దీక్షను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పనిచేస్తూ సెలవుపై ఉన్న నెల్లూరు నగర డీఎస్పీ సింధు ప్రియను డీజీపీ కార్యాలయం అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నెల్లూరు నగర ఎస్‌డీపీఓ దీక్ష ఐపీఎస్ శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం నగర పరిధిలోని తమ సిబ్బందితో మాట్లాడారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నగరంలోని సీఐలు, ఎస్ఐలు, ట్రాఫిక్ సీఐలు కలసి స్వాగతం పలికారు.

తదనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బం దికి సూచించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన దీక్ష ఐపీఎస్ ఢిల్లీలోని జెఎన్ఎలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఢిల్లీ యూనివర్సిటీలోని మిరాండా హౌస్ నుండి జార్జియాలో గ్రాడ్యుయేషన్ జేఎన్యులో మాస్టర్స్ పూర్తి చేశారు. ఢిల్లీ, అండమాన్ నికోబార్ పోలీస్ సర్వీస్‌లో ముందుగా పని చేసి.. ఆ తర్వాత ఐపీఎస్ కేంద్రకు ఎంపికయ్యారు. ముందుగా ఐపీఎస్‌కు సెలెక్ట్ అయినప్పటికీ మంచి క్యాడర్ రాకపోవడంతో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఆఫీసర్‌గా పని చేశారు. ఐపీఎస్ ఆఫీసర్‌గా ఎంపికై మంచి క్యాడర్‌ను యూపీఎస్సీలో సాధించి ఆరో ప్రయత్నంలో 2020లో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి తన ప్రతిభను చూపించారు.

-మిగతా 2లో

## ప్రజల మనిషి జాకీర్‌కు

# కన్నీటి నివాళి

- అశ్రునయనాల మధ్య టీడీపీ నేత జాకీర్ అంతిమ యాత్ర..
- పాడె మోసిన మంత్రి నారాయణ
- జాకీర్ మరణం తీరని లోటు
- జాకీర్ సేవలు చిరస్మరణీయం : మంత్రి నారాయణ

02



# ప్రజల మనిషి జాకీర్‌కు కన్నీటి నివాళి





- అశ్రునయనాల మధ్య టీడీపీ నేత జాకీర్ అంతిమ యాత్ర..
- పాడె మోసిన మంత్రి నారాయణ
- జాకీర్ మరణం తీరని లోటు
- జాకీర్ సేవలు చిరస్మరణీయం : మంత్రి నారాయణ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో విలక్షణ నేతను కోల్పోయామన్న వార్త నగరాన్ని విషాదంలో నింపింది. అజాత శత్రువుగా, నిబద్ధత గల నాయకుడిగా పేరుపొందిన టీడీపీ నేత జాకీర్ (42, 43 క్లస్టర్ ఇంఛార్జ్) అకాల మరణం నగరాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. విజయవాడ నుంచి నెల్లూరుకు వస్తుండగా.. మేదరమెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడం, పార్టీకి, ముస్లిం మైనారిటీ వర్గానికి తీరని లోటును మిగిల్చింది. శనివారం మధ్యాహ్నం ఖుద్దూస్ నగర్ నుండి ఫత్తేఖాన్ పేట కలాన్ మస్జీద్ వరకు జరిగిన ఆయన అంతిమ యాత్ర అత్యంత భావోద్వేగాల మధ్య సాగింది.

**అంతిమ ప్రార్థనలు - ప్రముఖుల నివాళి :**

తొలుత హాల్తాలిమ్ మస్జీద్‌లో జాకీర్ పార్థివ దేహానికి ముస్లిం సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు అజీజ్, టీడీపీ నేతలు జెడ్ శివప్రసాద్, వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు జాకీర్ పాడె మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంత్యక్రియలు ముగిసే వరకు మంత్రి నారాయణ అక్కడే ఉండి, తన ఆత్మీయ నేతకు కడసారి వీడ్కోలు పలికారు.

**నాయకుల భావోద్వేగ ప్రసంగాలు :**

మంత్రి నారాయణ మాట్లాడుతూ.. జాకీర్ అకాల మృతి నన్ను కలచివేసిందని, జెండావీధిలో ఒక గొప్ప ఆత్మీయ నాయకుడిని కోల్పోయానని, ముస్లిం సమాజ అభివృద్ధి కోసం ఆయన నిరంతరం పరితపించేవారన్నారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా జాకీర్ కుటుంబానికి భరోసా ఇచ్చారన్నారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ మాట్లాడుతూ.. జాకీర్ మృతి ముస్లిం సమాజానికి తీరని లోటని. పెద్ద పదవుల్లో లేకపోయినా, ఈ రోజు ఆయన అంతిమ యాత్రకు తరలివచ్చిన వేలాది మంది జనమే ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. గతంలో ఆయన పర్యవేక్షించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మళ్ళీ ఏర్పాటు చేసి, దానికి జాకీర్ పేరు పెట్టాలని మంత్రి నారాయణని కోరానని, అందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ.. జాకీర్ ఎప్పుడూ సమాజం మేలు కోసమే ఆలోచించేవారు తప్ప, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏమీ కోరలేదని, ఈనెల 17న నన్ను కలవాలని చెప్పారు, కానీ ఇలా అంతిమ యాత్రలో పాల్గొనాల్సి రావడం దురదృష్టకరం అన్నారు. పార్టీ ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నగర ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. జాకీర్ నా చిరకాల స్నేహితుడని, ఆయనలోని సేవా భావం మెండుగా ఉండేదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రాజకీయ, సామాజిక ప్రముఖులు, వేలాది మంది ప్రజలు పాల్గొని తమ నాయకుడికి కన్నీటి వీడ్కోలు పలికారు.

### డీఎంహెచ్వో కార్యాలయాన్ని తనిఖీ చేసిన

# ప్రజారోగ్య రాష్ట్ర సంచాలకులు



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని శనివారం ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ పద్మావతి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు, ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ జాతీయ రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలు అమలు తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిహెచ్సి స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అన్ని కార్యక్రమాలు ఇకమీదట ఈ–ఆఫీస్ ద్వారా నిర్వహించాలని, కాగిత రహిత పరిపాలన కొనసాగించాల్సిందిగా అధికారులను ఆమె ఆదేశించారు. అదేవిధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ మాన్యువల్ ఫైల్స్‌ని నిర్వహించకూడదని, అట్లా నిర్వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయని అధికారులను హెచ్చరించారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది వారికి కేటాయించిన సమయం ప్రకారమే ముఖా ఆదారిత హాజరు చేయవలసిందిగా ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరులో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని తెలియజేశారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు శుభ్రంగా ఉంచుకోవాలని, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వ్యాధులపై నిరంతరం నిఘా ఉంచాలని సదరు సమాచారం వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలని, అంతేకాకుండా ఎక్కడైనా సరే ఏమైనా వ్యాధులు ప్రజలతో ఉన్నట్లు గుర్తించితే వెంటనే నివారణ చర్యలు తీసుకొని అవి తగ్గేవరకు కూడా వైద్య శిబిరాలు నిర్వహించాల్సిందిగా వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. మందులు నిర్వహణ కూడా ఈ ఔషధీలో నమోదు చేయవలసిందిగా, ఓపి సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సంస్థాగత ప్రసవాలు మెరుగుపరచాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సుజాత, డిఎల్ ఏటిఓ డాక్టర్ షేక్ ఖాదరవల్లి, డిఐఓ డాక్టర్ ఏ ఉమామహేశ్వరి, కావలి డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ బిజిత, సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, డిఎన్ఎమ్ఓ డాక్టర్ సురేంద్ర, డిఎంఓ కనకరత్నం, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వణికిస్తున్న జ్వరం

*(మొదటి పేజీ తరువాయి)*

హాస్పిటల్లో పరిస్థితి. ఇవి రూము అద్దెలు మాత్రమే. మళ్లీ అదనంగా నర్సింగ్ చార్జి, డాక్టర్ చార్జి వీటన్నింటిని కలుపుకుంటే జ్వరానికే లక్షల రూపాయలు బిల్లులు వసూలు చేస్తున్నారు.

**పర్యవేక్షణ ఏది ?**

వైద్యశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. క్లినిక్‌లు, ల్యాబ్, స్కాన్‌లు తనిఖీలు చేసి ధరలను పరిశీలించాల్సి ఉన్నా.. ఆ చర్యలు లేవు. అవసరం లేకపోయినా.. పరీక్షలు చేయడంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రయివేటు ఆసుపత్రుల వైపే కన్నెత్తి చూడడం లేదు. దీంతో వారి దోపిడీకి అడ్డే లేకుండా పోతుంది. పొగతోటలోనే కొన్ని వందల ఆసుపత్రులు ఉన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

## ఎస్‌డీపీఓగా ఐపీఎస్ అధికారి దీక్ష

*(మొదటి పేజీ తరువాయి)*

హైదరాబాదులోని జాతీయ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఒక భార్యగా, తల్లిగా, కుటుంబాన్ని చూసుకునే గృహిణిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే కఠినంగా ఉన్న ఐపీఎస్ శిక్షణను పూర్తి చేశారు. ఫిట్నెస్‌పై అవగాహన ఉండడంతో గతంలో పోలీసు ఉద్యోగం చేసి ఉండడంతో ఐపీఎస్ శిక్షణ సులభతరం చేశారు. గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందారు. దీక్ష ఐపీఎస్ భర్త ఐఆర్ఎస్ ఆఫీసర్ ఢిల్లీలోని ఇన్కమ్ టాక్స్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో నగరంలో జరిగిన హత్యలు, దొంగతనాలు విషయంలో బాధ్యతలు స్వీకరించిన దీక్ష ఐపీఎస్‌కు సవాళ్లుగా ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించే దిశలో ఎలా ముందుకు సాగుతారో చూడాలి మరి.

### ఎస్పీని కలిసిన ఎస్‌డీపీఓ దీక్ష



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఎస్‌డీపీఓగా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ అధికారి దీక్ష.. శనివారం జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్లను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

## 24న అభివృద్ధి పనుల జాతర

**రూ.27 కోట్లతో 240 అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ప్రకటించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఈనెల 24న నెల్లూరు రూరల్ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గ పరిధిలో మరో చరిత్రాత్మిక ఘట్టం చోటు చేసుకోబోతున్నట్లు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సారథ్యంలో మొత్తం 27 కోట్లతో 240 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. స్థానిక ప్రజల చేత 24వ తేదీన ఏకకాలంలో అన్ని పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. 60రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసి ఒకేరోజు, ఒకే సమయానికి ప్రారంభోత్సవాలు చేస్తామని ఇప్పటికే 340 కోట్లతో రూరల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన వినతులు, ప్రజలు అడిగిన పనులను గుర్తించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రూరల్ నియోజకవర్గం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ నెల్లూరి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# హౌసింగ్ అక్రమార్కులను కాపాడుతున్న కూటమి ప్రభుత్వం

## అక్రమాలకు పాల్పడుతన్న వారిపై చర్యలు తీసుకోండి : బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో స్టీలు సిమెంట్‌ను అధికారులు మాయం చేశారు. కూటమి పాలనలోనూ ఆ అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా ఎందుకు కాపాడుతున్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీకి బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. 2022-24 మధ్యకాలంలో పేదల ఇళ్లకు కేటాయించబడిన స్టీలు సిమెంటును గోడౌన్ల నుండి బయటికి తరలించారు. వందల టన్నుల స్టీలు వేలాది బస్తాల సిమెంటు బయట విక్రయాలు చేసుకొని సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుపేద లబ్ధిదారులకు కేటాయించిన స్టీలు సిమెంట్ మెటీరియల్ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నెల్లూరు వెంకటేశ్వరపురం, కొండ్లపూడి, కావలి, పొదలకూరు, దుత్తలూరు, మనుబోలు, సంఘం, టీపీ గూడూర్, సీతారాంపురం, వింజమూరు, ఆత్మకూర్ హౌసింగ్ గోడౌన్లలో పెద్ద ఎత్తున మెటీరియల్ మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో అవినీతి అక్రమాలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటూ ఉన్నారు.. హౌసింగ్ శాఖలో మాత్రం నామమాత్రంగా అక్రమార్కులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. పేద లబ్ధిదారులకు చెందాల్సిన మెటీరియల్ రికవరీపై చర్యలు ప్రారంభించలేదు. ఒక్క క్రిమినల్ కేసు కూడా నమోదు చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వంలోచేసిన అవినీతి అధికారులపై టీడీపీ జనసేన బిజెపి పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ చర్యలు తీసుకోలేదు. అవినీతి అధికారులు గత వైసిపి పాలకులను



ఆశ్రయించినట్లే నేడు టిడిపి నాయకులను ఆశ్రయించబట్టే చర్యలు తీసుకోవడంలో ప్రస్తుత అధికారులు వెనుకంజ వేస్తున్నారని రమేష్ తన లేఖలో పేర్కొన్నారు. లబ్ధిదారుల ప్రయోజనాల దృష్ట్యా క్రిమినల్ కేసులు నమోదు చేసి మెటీరియల్ రికవరీ చేయాలని ప్రభుత్వానికి రమేష్ విజ్ఞప్తి చేశారు.

# కైలాసనందగిరి స్వామి పరమపదించడం బాధాకరం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** శ్రీ కైలాసనందగిరి స్వామి(క్రైలాసకోన) శుక్రవారం పరమపదించడం బాధాకరంగా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్నాటి రంగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 40 ఏళ్లపాటు నెల్లూరు కేంద్రంగా ఆర్ఎస్ఎస్‌లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ హిందూ సంఘటనకు పాల్పడ్డారు. సుమారు వంద మందికి పైగా సమాజ సేవకులుగా తీర్చిదిద్దారు. వారి ప్రేరణతో అనేకమంది వివిధ రంగాలలో జాతీయ భవంతో పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లా పుత్తూరు దగ్గర బట్టియ కండ్రికలో జన్మించారు. విద్యానగర్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1990లో మొదటి కరసేవలో పాల్గొన్న వీరు అనేక బాధాకర సంఘటనలను ఎదుర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రధాని ఇందిరాగాంధీ పాలన వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచే పోరాటంలో పాల్గొన్నారు. 17 సంవత్సరాల క్రితం కైలాస కోనలో తన జీవితాన్ని త్యజించి సన్యాస ధర్మం స్వీకరించారు. ఆధ్యాత్మిక జీవితం ద్వారా ఆదర్శవంతంగా ఉన్న కైలాసనందగిరి స్వామి మరణం సమాజానికి తీరని లోటని రంగారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

# 2025 డిఎస్సీ విజేతల అభినందన సభ

**కావలి, మేజర్‌న్యూస్ :** విజయవంతంగా 173మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన సందర్భంగా మెథడ్స్ కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2026 డిఎస్సీలో 500 మంది నిరుద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మార్చేందుకు ప్రణాళికను తయారు చేశామని, హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, రమేష్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా సాధన వృక్షలను వేలాది మందిని ఉత్తమ ఉపాధ్యాయుల తీర్చిదిద్దిన ఏకైక సంస్థ మెథడ్స్ కోచింగ్ సెంటర్‌ని తెలిపారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు అభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో అంకితభావంతో సామాజిక స్పృహతో పనిచేసి విద్యార్థులను ఉన్న స్థితిలో తీర్చిదిద్దేందుకు పేరు ప్రఖ్యాతులుగా ఉంచాలని కోరారు. ఈ




కార్యక్రమానికి సైకాలజీ నిపుణులు పి.మల్లికార్జున మాట్లాడుతూ.. రాష్ట్రములో మెథడ్స్ కోచింగ్ ఎందుకు ఎలా ఆధిక్యత పోస్టులు కైవసం చేసుకుందో వివరించారు. ఇందులో భాగంగా విశ్రాంతి ఉపాధ్యాయులు బాలకృష్ణయ్య ఉపాధ్యాయులు పి.చెన్నకేశయ్య, టి.నరసింహారావు ఎం. తిరుపతి స్వామి, వి.మాధవరెడ్డి, మోహన్‌రావు, తదితరులు పాల్గొని మాట్లాడుతూ.. కోచింగ్ సెంటర్ కావలిలో ఉండడం కావలి పరిసర ప్రాంతాల నిరుద్యోగులు వారి తల్లిదండ్రులు చేసుకున్న అదృష్టమని క్షుణ్ణంగా వివరించారు.

# విద్యార్థులకు సంక్రాంతి ఆటలు పోటీలు



## గెలుపొందిన 24 మందికి బహుమతులు పంపిణీ

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో సంక్రాంతి పండుగల సందర్భంగా నాలుగు రోజుల పాటు జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా వాలీబాల్, మ్యూజికల్ చైర్, లెమెన్ స్పూన్, స్పీడ్ వాక్, రన్నింగ్ రేస్, సూది - దారం, ముగ్గులు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం సాయంత్రం వెటరన్ జర్నలిస్ట్ డాక్టర్ నాగభూషణం కొప్పోలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ బీసీ జనరల్‌కు కేటాయిస్తూ హైకోర్టు తీర్పు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయిస్తూ శనివారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీ జనరలు కేటాయిస్తూ గతేడాది ఆగస్టు 14వ తేదీన జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అదేరోజు సాయంత్రం ఓసీ మహిళకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులు చట్టవిరుద్ధమంటూ జలదంకి ఎంపీటీసీ సభ్యుడు కుట్టుబోయిన మధుయాదవ్ హైకోర్టును ఆశ్రయించాడు. సమగ్రంగా విచారించిన హైకోర్టు న్యాయమూర్తి భానుమతి ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించాలని, మహిళల కోటాల పేరుతో కులం రిజర్వేషన్లు తొలగించడం సబబు కాదని తీర్పులో స్పష్టం చేశారు. దీంతో ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ స్థానాన్ని బీసీ జనరల్ కు కేటాయించాల్సిన అవసరం ఏర్పడింది. కాగా ఇటీవల ప్రభుత్వం ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ స్థానాన్ని జనరల్ మహిళా కింద ఉదయగిరి బీజేపీ మండల అధ్యక్షురాలు పాలుగుల్ల విజయలక్ష్మి ప్రకటించారు. కూటమి నాయకులు సంబరాలు సైతం చేసుకున్నారు. అయితే విజయలక్ష్మి నియామకంపై స్థానిక కార్యాలయానికి ఏలాంటి ఉత్తర్వులు అందలేదు.

# నేడు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడతాయని మండల తెలుగు దేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని తెలుగుదేశం జెండా వద్ద కార్యక్రమంలో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు కార్యక్రమానికి మండల తెలుగుదేశం నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో ఆదివారం నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారన్నారు. కావున మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు జయప్రదం చేయండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30 వర్ధంతి వేడుకలను జయప్రదం చేయవలసిందిగా క్లస్టర్ ఇన్‌చార్జ్ చేక్రోలు వసంతరావు కోరారు పంచాయతీ పాత బస్టాండ్ సెంటర్లో తెలుగుదేశం జెండా వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతున్నారు. కావున మండలంలోని తెలుగుదేశం నేతలు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు బూత్ ఇన్‌చార్జ్‌లు క్లస్టర్ కోఆర్డినేటర్లు యూనిట్ ఇన్‌చార్జ్‌లు క్లస్టర్ కోకన్వీనర్లు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## బెంగళూరుకు సాధారణ చార్జీతో సూపర్ లగ్జరీ బస్సు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి పండగ అనంతరం బెంగళూరుకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అదనపు చార్జీలు పెంచకుండా సాధారణ చార్జీలతోనే 17, 18వ తేదీలలో రాత్రి 7గంటల నుండి స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మెట్టు చంద్రశేఖర్‌రెడ్డి మెమోరియల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం

- దాత కాంట్రాక్టర్ మెట్టు రవీందర్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రశంసలు
- వీరంపల్లి సభలోమాట్లాడిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** తన సొంత నిధులతో సర్వేపల్లి నియోజక వర్గంలో ఐదు మినరల్ వాటర్ ప్లాంట్‌లు సమకూర్చిన వీరంపల్లి పంచాయతీ కొండుపాలెం గ్రామ వాస్తవ్యులు కాంట్రాక్టర్ మెట్టు రవీందర్‌రెడ్డిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సభలో అభినందించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని అక్కంపేట శ్రీరామ్ నగర్ కాలనీ మనుబోలు కోదండరాంపురం చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీ వీరంపల్లి పంచాయతీ లోని కొండుపాలెం అరుంధతివాడ కొండుపాలెం వెంకటాచలం మండలం లోని వడ్డీ పాలెంలో మెట్టు రవీందర్ రెడ్డి అయిదు వాటర్ ప్లాంట్లు తన తండ్రి జ్ఞాపకార్థం పెట్టడమే కాకుండా వాటిని మెయింటెన్ చేసి మినరల్ వాటర్ ఇచ్చిన ఘనత రవీందర్ రెడ్డికే చెల్లుతుందని చెప్పారు. వెంకటాచల మండలం వడ్డిపాలెం. అలాగే మండలంలోని వీరంపల్లి పంచాయతీ కొండు పాలెం, కొండు పాలెం అరుంధతీ యవాడ లో శనివారం ఉదయం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించి వీరంపల్లి జెండా మాను వద్ద ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. దాత మెట్టు రవీందర్ రెడ్డిని అభినందిస్తూ ఎమ్మెల్యే ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజా జీవితంలోకి వచ్చిన తర్వాత చీమకు కూడా అన్యాయం చేయకూడదని సోమిరెడ్డి చెప్పారు. తప్పు చేస్తే టీడీపీ వాళ్ళైనా సరే సహించనన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఇక్కడ వైకాపా నాయకుడు మాజీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్‌రెడ్డి వల్ల కొండు పాలెం హరిజనవాడలో 10 కుటుంబాలు ఊరు వదిలిపెట్టి పారిపోయారని ఎంత దారుణమని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పార్టీ అని చెప్పి పేదవాడి ఇల్లు రద్దు చేయడం బిల్లులు రాకుండా చేయడం ఏమిటని సోమి రెడ్డి అన్నారు. ఇలా చేసినందున హౌసింగ్ ఏఈ నీవల్ల సస్పెండ్ అయ్యాడని సోమిరెడ్డి సభలో చెప్పారు. వైసీపీ రెడ్డి వేరే వాళ్లదగ్గర ఐదు లక్షలు తీసుకొని సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్నషిఫ్ట్ ఆపరేటర్ యువకుడును తొలగించి వేరే వాళ్లకు ఉద్యోగం ఇచ్చే ప్రయత్నంచేయడం దారుణమని చెప్పారు. మీ పార్టీ నాయకుడు ఇలా చేస్తుంటే నువ్వు ఏమి చేస్తున్నావు గాడిదలు కాస్తున్నావా అంటూ గోవర్ధన్‌రెడ్డిపై సోమిరెడ్డి మండిపడ్డారు. నీవల్ల మీ పార్టీ నాయకులు వల్ల పది కుటుంబాలు ఊరు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏమిటని ఇదేనా మీరు చేసిన పరిపాలనఅంటూ విమర్శించారు. ఆ సమయంలో జనసేన పార్టీ నాయకులు నెల్లూరు కరెంట్ ఆఫీస్ దగ్గరకు వెళ్లి ప్రశ్నిస్తే వాళ్లను పోలీస్ స్టేషన్లు వేయించి కాకాని గోవర్ధన్ రెడ్డి కేసులు పెట్టించడం దారుణ మని విమర్శించారు. సర్వేపల్లి చరిత్రలో ఎప్పుడు ఇలాంటి దారుణాలు చోటు చేసుకోలేదని సోమిరెడ్డి ఆక్రోషించారు. అనేక మంది ఎమ్మెల్యేలు ఇక్కడ పని చేశారని వాళ్లు ఎప్పుడు నీలా లేరని చెప్పారు. తాను అనేక ఉద్య మాలు చేశానని అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రుల హయాంలో అపోజిషన్‌లో ఉండి అనేక ఉద్య మాల్లో పాల్గొన్నాని గుర్తు చేశారు. సిపిఎం నాయకులతో కలిసి ఉద్యమం చేశానని గుర్తు చేశారు. కానీ నన్ను ఏనాడు వాళ్లు నా పైన కేసులు పెట్టలే దని ఈ సందర్భంగా సభలో చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సర్వే పల్లి నియోజకవర్గంలో గోవర్ధన్ రెడ్డి నిత్యం వల్గర్ లాంగ్వేజ్ మాట్లాడుతు న్నాడని ఇలా ఎవరూ లేరని ఇదేమి కర్మ అనుకోవాలని సోమిరెడ్డి అన్నారు. రెండు నెలల క్రితం రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎవరో మెప్పుకోసం మాట్లాడితే ప్రజల్లో చులకన అయిపోతామని చెప్పిన విషయాన్ని ఈ సంద ర్భంగా సోమిరెడ్డి గుర్తు చేశారు. తనను తన తల్లిదండ్రులను అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన తల్లిదండ్రులను గోవర్ధన్‌రెడ్డి చాలా చుల కనగా.. చెడ్డగా మాట్లాడటం ఇదేమి కర్మని ఆరోపించారు. 2014 ఎమ్మెల్సీ ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు తనను వ్యవసాయ మంత్రిగా చేస్తే దేగపూడి బండేపల్లి కాలువ మంజూరు చేయించానని తెలిపారు. 2019లో ఎమ్మెల్యే గెలిచిన కాకాని గోవర్ధన్‌రెడ్డి 35శాతం జరిగిన పనులు కాంట్రాక్టర్‌ను తరిమేసాడని ఆరోపించారు. అలాగే సోమశిల దక్షిణ కాలువను 35 సంవ త్సరాలు కల ఆపేసాడని చెప్పారు. పొదలకూరులో అనేక గ్రామాలకు తాగు నీరు ఇచ్చే వాటర్ ప్లాంట్‌ను మూలన పడేసిన ఘనత గోవర్ధన్‌రెడ్డికే చెల్లిం దని విమర్శించారు. ఇక శ్రీధర్ కంపెనీ పేరుతో చెరువులకు చెక్కలు రెండు సార్లు మార్చినట్లుగా 8నుండి 9 కోట్లు డ్రా చేసిన మహానుభావుడని ఆరోపిం చారు. ఐదు సంవత్సరాలు రైతులు కడుపు కొట్టి వ్యవసాయాన్ని సర్వ నాశనం చేశాడని మండిపడ్డారు. రెండో క్రాపుకు నీళ్లు ఇవ్వకుండా మూడు న్నర లక్షల ఎకరాలు బీడు పెట్టించినవని కాకాని గోవర్ధన్ రెడ్డి పైన మండి పడ్డారు. రామిరెడ్డి సీఈఓగా ఉన్నప్పుడు ఒక టీఎంసీతో 16వేల ఎకరాలు పండించామని తెలిపారు. పొలాలు రికార్డులు మార్చడం ఒకరు భూములు ఒకరికి అప్పగించడం చేసి ఐదు సంవత్సరాలు వైకాపా ప్రభుత్వం భ్రష్ట పట్టించిందని సోమిరెడ్డి చెప్పారు వీరంపల్లి మనుబోలు మూడు కోట్లతో రోడ్డు విస్తరణ టెండర్ దశలో ఉందని చెప్పారు. వీరంపల్లి పంచాయతీలో 36లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ మంజూర అయిందని తెలిపారు. రెండు కోట్ల పది లక్షలతో జేజేఎం పథకం కింద తాగునీటి పథకాలు ఐదు ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నాయని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. వీరంపల్లి గ్రామంలో తల్లికి వందనం పెన్షన్ అన్నదాత సుఖీభవ నిధుల వివరాలను అభివృద్ధి పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను



ఎమ్మెల్యే విపులంగా చెప్పారు.. కొండుపాలెం దళితవాడి నుంచి ఊరు విడిచి వెళ్లిన 10 కుటుంబాలను తిరిగి గ్రామానికి ఆహ్వానించాలని సందర్భంగా సభలో సోమిరెడ్డి పిలుపునిచ్చారు. వాళ్లను టచ్ చేసే దొమ్మ ఎవరికి లేదని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ వేదిక పైన దాత మెట్టు రవీందర్ రెడ్డిని అభినందించి శాలువా కప్పి సత్కరించారు. ముందుగా ఈ సభలో ఆ గ్రామ టిడిపి నేత పొట్టేలు ప్రసాద్ ప్రసంగించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి లాంటి నాయకుడు మనకు దొరకడం మన అదృష్టం అనే కితాబు ఇచ్చారు. మనకు ఎక్కడ తగవులుఒద్దని అందరూ బాగుండాలి. అందులో మనం ఉండాలని సిద్ధాంతంతో గ్రామంలో ఎక్కడ గొడవలు తగులు లేవని స్పష్టం చేశారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళదామని మన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మనకు అండగా ఉంటారని కొనియాడారు. ప్రసాద్ ప్రసంగం అడుగడుగునా జనాలను ఆకట్టుకుంది. ప్రసాద్ మాట్లాడుతున్నంత సేపు చప్పట్లు కొట్టి ఈలలు వేశారు. ఈ సభలో దాత మెట్టు రవీందర్ రెడ్డి, టీడీపీ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య, జట్ల కొండూరు నీటి సంఘం అధ్యక్షులు ఏలూరు కోదండరామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కలికి వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, మడమనూరు నీటి సంఘ అధ్యక్షులు నూనె లక్ష్మయ్య యాదవ్, కనుపూరు కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వర్ధినేని మస్తాన్ నాయుడు, మనుబోలు నీటి సంఘం అధ్యక్షులు పచ్చిపాల రామిరెడ్డి, రవెన్నకుమారుడు మెట్టు సాయిరెడ్డి వీరంపల్లి టిడిపి నాయకులు మన్నారపు రఘురామయ్య, అల్లా రెడ్డి రవీందర్ రెడ్డి, దగ్గవోలు రామిరెడ్డి. ఏళ్ల యానాది నాయుడు, మోడిపోయిన వెంకటరామయ్య, పలికిలి రామకృష్ణ. పొట్టేళ్ల మస్తాన్, బొనిగి పరంధామయ్య. సుబ్రహ్మణ్యం, చెన్నూరు మూర్తి, శ్రీధర్ రెడ్డి (చెన్నూరు) ఎంపీడీవో జలజాక్షి, డీటీ ప్రదీప్, ఆర్ఐ అరుణ్ తేజ, విఆర్ఓలు మురళి, గుణ శేఖర్, డిప్యూటి ఎంపీడీఓ గరుడయ్య, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివ రాకేష్. ఆర్డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ శరత్, సచివాలయ సిబ్బంది, సౌమ్య అంకయ్య, శ్రావణి, గిద్దంటి రామకృష్ణ, ప్రసాద్(రాజోలపాడు) మాజీ ఎంపీటీసీలు చింతగుంట వేమయ్య, తాటిపర్తి రాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీబుగ్గేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని ఆకిలవలస గ్రామ శివారు ప్రాంతంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ బుగ్గేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా కన్నులు పండువగా జరిగింది. వేలాది మంది భక్తులతో బుగ్గ ప్రాంతం కిక్కేరిచిపోయింది. ఆకిలవలస గ్రామ సర్పంచ్ చెన్ను పెంచలరెడ్డి పర్యవేక్షణలో 11వ మాసశివరాత్రిని పురస్కరించుకుని శ్రీస్వామివారికి నాదస్వర కచ్చేరి, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, హెూమం, మహా పూర్ణాహుతి, నాదస్వర కచ్చేరి, శ్రీపార్వతిదేవి సమేత బుగ్గేశ్వర స్వామివారి కళ్యాణం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, అనంతరం పల్లకిసేవ, భజన వంటి కార్యమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు నల్లవడ్ల వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేష్ అనే యువకుడు రచించిన పంచభూత లింగాలు వాటి విశిష్టత గురించి తెలియజేసే పాటను పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి, ఆకిలవలస సర్పంచ్ చెన్ను పెంచలరెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి తదితరులు ఆవిష్కరించారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట మండలంలోని తిరుమలాపురం పంచాయతీ గుడినరవ గ్రామ రైతులు శనివారం యూరియా కోసం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలు వరు రైతులు మాట్లాడుతూ గ్రామంలో పంటల సాగు అధికంగా చేపట్టారన్నారు. అయితే స్థానిక రైతుసేవా కేం ద్రంలో వారం రోజులుగా యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతన్నామన్నారు. యురియాపై సిబ్బందిని ప్రశ్నించగా అదిగో వస్తుంది.. ఇదిగో వస్తుందని.. మాటలు చెబుతున్నారే తప్ప రావడం లేదన్నారు. ఉదయగిరికి వచ్చి యూరియా తెచ్చుకోవాలంటే రవాణా ఖర్చులు తడిసిమోపడవుతున్నాయని వా పోయారు. రైతుసేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంటే ఏలాంటి రవాణా ఖర్చులు లేకుండా నేరుగా పొలానికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుసేవా కేంద్రంలో యురియా అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేశారు.

## కాకాణి ఇంట సంక్రాంతి సంబరాలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలో స్వగ్రామమైన తోడేరులో వైసీపీ నెల్లూరుజిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా తమ తండ్రి కాకాని రమణారెడ్డి ఘాట్ వద్దకు కుటుంబ సభ్యులతో చేరుకొని నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు గ్రామస్తులు అభిమానులు మధ్య సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భారీగా వైసిపి నాయకులు అభిమానులు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏటా సంక్రాంతి పండుగను తన స్వగ్రామైన తోడేరులో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, తమపై అభిమానంతో శుభాకాంక్షలు తెలిపిన ప్రతి కార్యకర్తకు అభిమానికి గ్రామస్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వేడుకల్లో వైసీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చంద్రపడియ గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గత కొద్ది రోజులుగా ఉత్సాహ భరితంగా సాగిన క్రికెట్ టోర్నమెంట్ నేటితో ఘనంగా ముగిసింది. ఈ క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. జనవరి 11న ప్రారంభమైన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 టీములు ఉత్సాహంగా పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ అనంతరం, విజేతగా నిలిచిన జట్టుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. ప్రథమ బహుమతిగా విజేత జట్టుకు రూ.60వేల నగదు పురస్కారం, ట్రోఫీని అందించారు. ద్వితీయ బహుమతిగా రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.30వేల నగదు బహుమతిని అందజేశారు. వీటితోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమెంటోలను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఒక అద్భుతమైన వేదిక అని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా యువతలో క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రీడల వలన విద్యుతో పాటుగా ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. ఉన్నత ఉద్యోగాలలో క్రీడాలకోట కింద ఉద్యోగాన్ని పొందే ఆస్కారం ఉందన్నారు కాబట్టి యువత విద్యతో పాటుగా క్రీడలను కూడా పెంపొందించుకొని నైపుణ్యాన్ని సంతరించుకోవాలన్నారు. గ్రామస్తులు ఇలాంటి పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఇంతటి చక్కని క్రీడా పోటీలను ఏర్పాటు చేసిన చంద్రపడియ గ్రామస్తులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు, అతిథులు చంద్రపడియ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు వినోద్, కృష్ణ, రామారావు, శివ, సుదీప్ తమ శక్తివంచన లేకుండా కృషి చేసి ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దొరస్వామి నాయుడు, క్లస్టర్ కో-కన్వీనర్ పాములపాటి మల్యాద్రి, ఇతర స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడాకారుల కేరింతలు, ఉత్సాహభరిత వాతావరణం మధ్య ఈ టోర్నమెంట్ ముగియడంతో చంద్రపడియ గ్రామంలో సందడి నెలకొంది.

# ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు చెందిన దేశంలోని వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న సంఘ పరివార్ (ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ) కార్యకర్తల ఆత్మీయ సమావేశం సంక్రాంతి సందర్భంగా వింజమూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ ప్రచారక్ వీరదిమ్ము కొండారెడ్డి మాట్లాడుతూ.. 1925లో ప్రారంభించిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ నేడు 2025లో శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నదని ఈ సందర్భంగా దేశంలోని 140కోట్ల మందికి కూడా కుటుంబ సౌభ్రాతత్వం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ వస్తువుల వినియోగం, ప్రభుత్వ చట్టాలు - పౌర విధులు పాటింపు వంటి పంచ పరివర్తనాల గురించి స్వయం సేవకులు ప్రతి ఇంటికి కూడా స్వయంగా వెళ్లి వాటి విశిష్టతను తెలియజేయాలని తద్వారా భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తయారు చేసే దానికి సంఘ స్వయం సేవకులు కృషి చేయాలని పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ.. ఉదయగిరి ఆత్మకూరు నియోజకవర్గాలకు చెందిన అనేకమంది విద్యార్థులు ఏబీవీపీలో పూర్తి సమయ కార్యకర్తలుగా పనిచేసే విద్యార్థి పరిషత్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ప్రస్తుతం విజయవాడలో నూతనంగా నిర్మిస్తున్న నూతన కార్యాలయ నిర్మాణానికి తమ వంతు సహాయం చేయాలని పేర్కొన్నారు. ఏబిఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ఏబీవీపీ పూర్వ జాతీయ కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గాలలో గ్రామ స్వరాజ్యం కొరకు పల్లెలలో కనీస వసతుల కొరకు సంఘ పరివార్ చెందినటువంటి కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. మనం ఏ ప్రాంతాలలో నివసిస్తున్నప్పటికీ మన సొంత గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులు లక్ష్మణ్, ఆదినారాయణ, శ్రీనివాసులు, శ్రీరామ్ చిన్న, సంఘ పరివార్ కార్యకర్తలు తిప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, రవి, చల్లా కౌశిక్ యాదవ్, కందల మధుసూదన్ రెడ్డి, నీలం శివ రామకృష్ణ, జగదీష్, రమేష్ నాయుడు, భాష్యం కృష్ణవేణి మొదలైన 75 మంది కార్యకర్తలు హాజరయ్యారు.

# పాట్టేపాళెంలో షటిల్ పోటీలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం పాట్టేపాళెంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన షటిల్ పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నెల్లూరు డివిజన్ కార్యదర్శి ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ.. నేటి మన పాలకుల విధానాల వల్ల నేడు యువతీ యువకులు తాను చదివిన డిగ్రీలకు తగిన ఉపాధి దొరకక ఇబ్బంది పడుతున్నారని అలాంటివారు సమాజంలో చెడు ప్రభావాలకు లోనయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రభుత్వాలు దీనిని గుర్తించి వారి చదువు తగ్గ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం షటిల్ పోటీలలో గెలిచిన మొదటి బహుమతినీ పి.శేషు టీం రెండవ బహుమతి ఏ.సూర్య టీం విజేతలకు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.విజయ్ ఆలూరు రాజా, ఏ సూర్య పుట్టా సాయి పొట్టేపాలెం శేషు, పరస తేజ, చింత ప్రమోద్ కుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## విజేతగా కదిరినేనిపల్లి కింగ్స్ టీమ్




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం చిన్నమాచనూరు పంచాయతీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కదిరినేనిపల్లి కింగ్స్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 17 జట్లు ఉత్సాహంగా పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన కదిరినేనిపల్లి కింగ్స్ టీమ్ విజేతగా నిలిచింది. అదే విధంగా పోలిరెడ్డిపల్లి రైజర్స్ టీమ్ రన్నర్స్‌గా నిలిచి రెండో స్థానాన్ని దక్కించుకుంది. విజేతలుగా నిలిచిన కదిరినేనిపల్లి కింగ్స్ టీమ్‌కు రూ.16 వేల నగదు బహుమతి, రన్నర్స్‌గా నిలిచిన పోలిరెడ్డిపల్లి రైజర్స్ టీమ్‌కు రూ.12,500 నగదు బహుమతిని మేనేజ్‌మెంట్ టీమ్‌కు చెందిన తల్లిదండ్రులు చేతుల మీదుగా అందజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా ఈ క్రికెట్ పోటీలు నిర్వహించడంపై స్థానికులు అభినందనలు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంలో ఇటువంటి టోర్నమెంట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## గ్యాస్ వినియోగంపై అవగాహన




**రాపూరు, మేజర్‌న్యూస్ :** హెచ్పీ గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ వాడకంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీనివాస హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ రాపూరు వారు శనివారం పట్టణంలోని స్టేట్ బ్యాంకు వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేళా ముఖ్య ఉద్దేశం పండుగల సందర్భంగా దూర ప్రాంతాల వారు సొంత ఊర్లకు విచ్చేసిన వారికి గ్యాస్ వినియోగంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు తెలిపారు. గ్యాస్ వినియోగపు నాణ్యతకు ఉపయోగ పడే వస్తువులు హెచ్పి కార్పొరేషన్ అప్రూవల్ పొందిన ఎల్పీజీ స్టవుస్, లెటర్స్, హెూస్ పైపులు గురించి వినియోగ దారులకు వివరించారు. గ్యాస్‌కి సంబంధించి వస్తువులు బయట దొరికెవి అంత నాణ్యతగా ఉండవని తెలిపారు. నాణ్యత గల వస్తువులు గ్యాస్ ఏజెన్సీలలో మాత్రమే దొరుకుతాయన్నారు. గ్యాస్ వినియోగదారులు ప్రతి రెండు సంవత్సరాలకి గ్యాస్ పైపు మార్చుకొని గ్యాస్ ప్రమాదాలను నివారించాలని వారు వినియోగ దారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు హెచ్పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గంగోడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకయ్య నాయుడుని కలిసిన భరత్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు నెల్లూరు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్ ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడుని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రాష్ట్రాభివృద్ధి, పార్టీ బలోపేతం అంశాలపై సానుకూల చర్చ జరిగింది. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా సూచనలు చేశారు. అనంతరం భరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. వెంకయ్య నాయుడు అనుభవం, మార్గదర్శనం పార్టీకి ఎప్పటికీ ప్రేరణనిస్తుందన్నారు. ఈ మర్యాదపూర్వక భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

# ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రభోజుడు, సమరాంగణసార్వభౌముడు, ఓటమి ఎరుగని మహావీరుడు, సకలకళావల్లభుడు, విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయచక్రవర్తి జయంతి వేడుకలను శనివారం బలిజ సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. నెల్లూరులోని కాపు భవన్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డెల్టా హాస్పిటల్‌లో కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. శ్రీకృష్ణదేవరాయల ఖ్యాతిని, ఆయన జైత్రయాత్రను, ఆయన చేసిన ప్రజారంజకపరిపాలనా తీరును, ఆయ నిర్మించిన అనేకానేక కట్టడాలు, నిర్మించిన చెరువులు తదితర వివరాలను గురించి బలిజ సేవా ఫౌండేషన్ చైర్మెన్, డెల్టా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖపల్మనాలజిస్ట్ డాక్టర్ పోకల రవి వివరించారు. ఈకార్యక్రమంలో బలిజసేవాఫౌండేషన్ ప్రధానకార్యదర్శి కమతం సుబ్బారావు, నాయకులు డి.సుధాకర్, లక్ష్మి నారాయణ, చెక్కాకుమార్, గుణసాని శ్రీనివాస్, దాడి శ్రీనివాసులు,



కొనపరెడ్డి రవికుమార్, మైలు జయకృష్ణ, తోటమధన్‌మోహన్, వడ్ల విష్ణు మోహన్, బెల్లం సుధామాధవ్, కత్తుల ఉమామహేశ్వర్, బివిశెట్టి కిషోర్, అంకయ్య, నలిశెట్టి సందీప్, రాజ్యం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో ముగ్గులు, కబడ్డీ, పోటీలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని అయ్యగారిపాలెం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జనసేన సీనియర్ నాయకుడు జనసేన పార్టీ బోయినపోయిన ప్రసాద్ యాదవ్, పసుపులేటి ప్రసాద్ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు దాసినేటి అనిల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్రాంతి వేల ముగ్గులు పోటీలు నిర్వహించడం సాంప్రదాయ బద్ధంగా వస్తుందన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న అందరికీ జనసేన నాయకులు ధన్యవాదాలు తెలిపారు. గెలిచిన ముగ్గురు వ్యక్తులకు మొదటి బహుమతి గెలుచుకున్న హర్షిత కు 1016 రెండవ బహుమతి గెలుచుకున్న శ్రీలక్ష్మికి 516 మూడవ బహుమతి విజేతగా మల్లీశ్వరి 216 అందజేశారు. మిగిలిన వారికి బాక్సులు వస్తువులు పంపిణీ చేశారు. అదేవిధంగా కబ్బడి పోటీలు నిర్వహించి ఎస్సీ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించి మొదటి బహుమతి బందుల భవంతి 1016 రెండవ బహుమతి బందుల జానకి 516 మూడో బహుమతి బందుల గాయత్రి 216 మిగిలిన వాళ్లకు వస్తువులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కట్ట పవన్ కుమార్, కట్ట రామ్మోహన్, చొప్ప ఆనంద్, కట్ట అరుణ్, పాల్గొన్నారు.

# ఎన్‌టీఆర్ వర్ధంతిని ఘనంగా జరుపుకుందాం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో దివంగత ముఖ్యమంత్రి, తెలుగు దేశం వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుందామని తెలుగుదేశం నాయకులు నిర్ణయించారు. శనివారం వారంతా సమావేశమై రాష్ట్రంలో రాజకీయసంచనలం సృష్టించిన, సంక్షేమాలరూపశిల్పిగా నిలిచిన, సంస్కరణల నేతగా పేరుగాంచిన, సినీరంగంలో మకుతంలేని మహారాజుగా వెలుగొందిన ఎన్‌టిరామారావు వర్ధంతి కార్యక్రమాలను దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించుకుందామని వారు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండువద్ద ఉన్న అన్నాక్యాంటిన్ సమీపంలో ఈవేడుకలను నిర్వహించేలా వారు నిర్ణయించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించేలా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి మండల, వార్డు, యూనిట్, క్లస్టర్ తెలుగుదేశం నాయకులు, సొసైటీల అధ్యక్షులు, సభ్యులు, వ్యవసాయమార్కెట్‌కమిటీ ప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎన్టీయార్, బాలకృష్ణఫ్యాన్స్ ప్రతినిధులు విరివిగా హాజరు కావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్ధార్, పట్టణ తెలుగుదేశం ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య,కౌన్సిలర్లు సూరా భాష్కర్‌రెడ్డి, గంధళ్ళ వేణు, దగ్గుమాటి శివకోటారెడ్డి, షేక్ గౌస్‌బాషా, పొడమేకల పెంచలయ్య యాదవ్, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకుడు కేతా విజయభ్కార్‌రెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, సిండికేట్ రైతుసేవా సహకార సంఘం చైర్మెన్ పరిటాల సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

# లైబ్రేరియన్‌లేని ఆత్మకూరు గ్రంధాలయం

## 15సంవత్సరాలుగా ఇన్‌చార్జ్‌తోనే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లా గ్రంధాలయసంస్థ శాఖా గ్రంధాలయం ఒకటిన్నర దశాబ్దకాలంగా లైబ్రేరియన్ లేకుండానే ఇన్‌చార్జ్‌తోనే కొనసాగిస్తున్నారు. 2009లో ఇక్కడ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఏ.గోవిందరెడ్డి రిటైర్ అయ్యారు. నాటినుండి ఓంకారం శ్రీనివాసరాజు అనే లైబ్రేరియన్ మర్రిపాడు, సంగం, ఏఎస్‌పేటల్లో రెగ్యులర్ లైబ్రేరియన్‌గా, ఆత్మకూరు గ్రంధాలయ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రెవిన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గకేంద్రం, వివిద శాఖల డివిజన్‌కేంద్రంగా, మండల కేంద్రంగా కొనసాగుతున్న ఆత్మకూరులో గ్రంధాలయానికి గ్రంధబాంఢాగారి లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తుసాక్ష్యంగా ఉంది. దశాబ్దాల తరబడి ఆత్మకూరు గ్రంధాలయానికి స్వంత భవనం లేకుండా అద్దెభవనం కొనసాగుతుండగా నాలుగేళ్ళక్రితం స్థానిక ఇందిరాగాంధీమహిళామండలి భవనాన్ని ఆభవ నిర్వాహకులు గ్రంధాలయానికి అప్పగించారు. అయితే లైబ్రేరియన్ మాత్రం ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరాజును కొనసాగిస్తున్నారు. శ్రీనివాసరాజు విధుల నిర్వహణలో అత్యంత చిత్తశుద్ధిగా వ్యవహరి స్తుంటారు. కానీ ఆయనను ఆత్మకూరుకు బదిలీచేయాలని పలువురు కోరుతుండగా ఆత్మకూరు గ్రంధాలయం బిక్యాటగిరిలో ఉందంటున్నారు. డివిజన్ కేంద్రంగా అనేక కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రవేటుపరంగా దాదాపు 30 విద్యా సంస్థలు, అదీగాక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ, గురుకుల తదితర ప్రత్యేక విద్యాసంస్థలుండగా ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏ క్యాటగిరిగా మార్చకపోవడం విశేషం. అదీగాక ఆత్మకూరు గ్రంధాలయంలో వేలకొద్ది అన్ని రకాలు పుస్తకాలున్నాయి. అన్నివర్గాలకు అవసరమైన అన్ని పుస్తకాలున్నాయి. జిల్లాలో దాదాపు 50శాతం లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అటు ప్రభుత్వం, ఇటు జిల్లా గ్రంధాలయ సంస్థ లేదా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏగ్రేడ్‌గా మార్చాలని, రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన వరికుంటపాడు బస్టాండ్ సెంటర్లో ఆదివారం నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# కత్తితో దాడిపై కేసు నమోదు


**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని శకునాలపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అల శ్రీను శనివారం తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి 'చెందిన రేకలగుంట అంకయ్య, ఓబులమ్మల మధ్య మేకల విషయమై ఈనెల 14వ తేదీన వివాదం చోటుచేసు కొంది. పండుగకు గ్రామానికి వచ్చిన ఓబులమ్మ కుమారులు మనోజ్, రామకృష్ణలు శుక్రవారం రాత్రి అంకయ్య ఇంటిమీదకెళ్లి అప్పట్లో జరిగిన గొడవపై విషయంపై వివాదానికి దిగారు. ఈ క్రమంలో అంకయ్య ఇంట్లో నుంచి బయటకు వచ్చి మచ్చు కత్తి తిప్పడంతో మనోజ్ చేయి, కాలిపై గాయాలయ్యాయి. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించారు. అంకయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఎన్‌టీఆర్ వర్ధంతికి రూరల్‌నుండి తరలిరావాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని, ఈ కార్యక్రమానికి ఆత్మకూరు రూరల్‌మండల పార్టీ శ్రేణులు తరలిరావాలని మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకరపెంచల చౌదరి కోరారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండువద్ద ఉన్న అన్నా క్యాంటిన్ సమీపంలో ఈవేడుకలను నిర్వహించనున్నామని, పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించేలా నిర్ణయించామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమానికి మండల, గ్రామ, యూనిట్, క్లస్టర్ తెలుగు దేశం నాయకులు, సొసైటీల అధ్యక్షులు,సభ్యులు, వ్యవసాయ మార్కెట్‌కమిటీ ప్రతినిధులు, నామినేటెడ్‌పదవుల్లో ఉన్న నాయకులు,టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎన్టీయార్, బాలకృష్ణఫ్యాన్స్ ప్రతినిధులు విరివిగా హాజరుకావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెంచలచౌదరి కోరారు.

# రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రసాదురావు మృతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాతపాటి ప్రసాదురావు(74) శనివారం తెల్లవారుఝామున మృతి చెందాడు. అందరూ అంజయ్య అయ్యవారుగా పిలుచుకునే ప్రసాదురావు వయోభారం, అనారోగ్యంతో తమ కుమారువద్ద ఇటీవల ఉంటూ హైదరాబాదులో మృతిచెందాడు. ఆయన ఎక్కువకాలం నువ్వురుపాడులో అధికకాలం పనిచేసి నాటికాలపు స్థిరమైన విద్యను అందరికీ అందించి మంచి పేరుప్రఖ్యాతులు గాంచారు. రిటైర్ అయ్యాక ఆయన ఆత్మకూరులో నివాసం ఉంటుండేవారు. ఆయనకు ఇద్దరు కుమారులుండగా వారు ఉపాధిరీత్యా హైదరాబాదులో ఉంటున్నారు. ఆయన మృతికి నువ్వురుపాడు తెలుగుదేశం యూనిట్ ఇన్‌చార్జ్, రెడ్డిసంఘ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి రమణారెడ్డి తదితరులు ప్రగాఢసంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

# పెన్నా తీరాన.. అంగరంగ వైభవంగా 'ఏటి పండుగ' సంబరాలు



- నెల్లూరులో గొబ్బెమ్మల కోలాహలం..
- చిన్నారులతో కలిసి పతంగులు ఎగురవేసిన మంత్రి నారాయణ
- ముగిసిన సంక్రాంతి సంబరాలు
- పెన్నా నదిలో వైభవంగా దేవతామూర్తుల దర్శనం
- గొబ్బెమ్మల నిమజ్జనం
- కళకళలాడిన పెన్నా తీరం
- తెలుగు సంస్కృతి, జానపద కళల మేళవింపుగా 'ఏటి పండుగ'
- 'ఏటి పండుగ' ఘనంగా ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని పెన్నా నది తీరం సంక్రాంతి సంబరాలతో పులకించిపోయింది. సంక్రాంతి ముగింపు వేడుకగా జరుపుకునే 'ఏటి పండుగ' శనివారం నాడు అత్యంత వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన నగరవాసులతో పెన్నా తీరం జనసంద్రమైంది. ఈ వేడుకలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మంత్రికి జిల్లా అధికారులు, టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు.అనంతరం మెప్మా మహిళలు మరియు వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించి, వారిని ఉత్సాహపరిచారు. ఆధ్యాత్మికత, సాంస్కృతిక వేడుకలు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 12 ప్రముఖ ఆలయాలకు చెందిన 12 మంది దేవతామూర్తుల నమూనాలను ఒకే చోట ప్రతిష్టించారు. మంత్రి నారాయణ దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా గొబ్బెమ్మల నిమజ్జనోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి మంత్రి పతంగులు ఎగరవేసి సందడి చేశారు. కళా ప్రదర్శనల కోలాహలం పెన్నా తీరంలో తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా అనేక ప్రదర్శనలు నిర్వహించారు. జానపదలు తోలుబొమ్మలాట, పులి వేషాలు, బుడబుక్కల, దేవర వేషధారణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యం, తప్పెటగుళ్ళు, లంబాడీ, డప్పులు, మార్వాడీ గంజీర ప్రదర్శనలు నేత్రానందం కలిగించాయి. హరిబాబు 'హాస్యవల్లరి' నవ్వులు పూయించగా, సంగీత విభావరి వీనులవిందు చేసింది. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు విశిష్టతను చాటిచెప్పారు. రాష్ట్రమంతా సంక్రాంతిని మూడు రోజులు జరుపుకుంటే.నెల్లూరు వాసులు మాత్రం 4వరోజు ఏటి పండుగను అదనంగా జరుపుకుంటారని.. పెన్నానదిలో గొబ్బెమ్మల నిమజ్జనం ఇక్కడి ప్రత్యేకత అన్నారు.టూరిజం, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో జిల్లా కలెక్టర్ అద్భుతమైన ఏర్పాట్లు చేశారని అభినందించారు. పెన్నా తీరంలో ఘాట్ అభివృద్ధి చేయాలని ఉన్నప్పటికీ, వరదల కారణంగా నది పాయలుగా మారడంతో ప్రస్తుతం సాధ్యపడలేదని తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాల సంస్కృతిని ప్రతిబింబించేలా స్టాల్స్, 12 దేవాలయాల నమూనాలు ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం ఆర్థికంగా బాగుండాలని కోరుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అద్భుతమైన ఏర్పాట్లు చేసిన మంత్రికి మరియు అధికారులకు నగరవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు,ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, టౌన్ డిఎస్పి దీక్ష, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి,నగర అధ్యక్షుడు మామిడాల మధు,మహిళ అధ్యక్షురాలు కపిరా రేవతి, స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.













## ఫ్రీహోల్డ్‌భూములకు మోక్షం కాగితాలకు, ప్రకటనలకే పరిమితమా!

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం డిఫారం పట్టాలుగా ఇచ్చిన రైతులకు చెందిన భూములను శాశ్వతపట్టాలుగా (ఫ్రీహోల్డ్) మార్చగా నేటి ప్రభుత్వం వాటి ప్రక్రియను నిలిపివేసిందని, దాంతో పలువురి ఆశలు అడియాశలై నిరుత్సాహంగా ఉన్నారు. ఆ ఫ్రీహోల్డ్ భూములకు మోక్షం కల్గించాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈఅంశంగురించి మంత్రి మండలిలో నేటి పాలకులు చర్చించి నెలలోగా పరిష్కరించేలా నిర్ణయించినా ఇంకా అతీగతీ లేదు. తరచూ ప్రకటనలు వెలువడుతున్నాయే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు రెండేళ్ళకితం ఈ సర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి 2023లో ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రీహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెంది ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విధానంలో గత ప్రభుత్వం అనేకఅవకతవకలకు, అక్రమాలకు పాల్పడిందని, పలువురి డిఫారం భూములను స్వాహాచేశారని, తదితర కారణాలతో ఈ ప్రభుత్వం నిలిపివేసిందని చెబుతున్నారు. కానీ సక్రమంగా అర్హులకలిగి డిఫారం పట్టాలు పొంది గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ అని సర్టిఫికేట్లు ఇవ్వబడిన నిజమైన రైతులకు ఈనిబంధనలు వర్తింపజేయాలని కోరుతున్నారు. గతంలో ఇచ్చిన ఫ్రీహోల్డ్ సర్టిఫికేట్లుతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళితే ప్రభుత్వం నిలిపివేసిందని, ఈ భూములు రిజిస్ట్రేషన్ కాజాలవని చెబుతున్నారు. ఇటీవల ఈ విషయమై ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఓ సమావేశం నిర్వహించినా ఫ్రీహోల్డ్ భూములకు మోక్షం లభించలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు పరిశీలించి సక్రమంగా ఉన్న ఫ్రీహోల్డ్‌పొందిన భూములు రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## ఆటో బైక్ ఢీ ఇద్దరికీ గాయాలు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మలుపు వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కనీయం పాడు గ్రామానికి చెందిన ఆదినారాయణ వెంకటస్వామి ఉదయగిరి నుంచి ద్విచక్ర వాహనంపై కనీయంపాడు స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా జాతీయ రహదారి 525 నుండి మలుపు తిరుగుతుండగా పామూరు నుండి దుత్తలూరుకు వేగంగా వెళుతున్న ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రయాణం చేస్తున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# లాండ్ టైటిలింగ్ రద్దు చేశాం : మంత్రి ఆనం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే గత ప్రభుత్వం జారీచేసిన ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేశామని ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతసాగరం మండలంలోని ఉప్పలపాడు, ఆమెని చిరువెల్ల గ్రామాలలో మీ భూమి మీ హక్కు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లా డుతూ.. రైతుల భూములకు పూర్తిగా చట్టబద్ధత కల్పిస్తూ నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో 21 లక్ష మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. పట్టాదారు పాస్ పుస్త కాలు డిసెంబర్ 31వ తేదీ వరకు రెవెన్యూ అధికారులు రైతులకు అందజేస్తారని అన్నారు. రైతాంగానికి, ప్రజలకు మంచి చేయాలని గొప్ప ఆలోచనతో కూటమి ప్రభుత్వం పని చేస్తుంద న్నారు. ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో పట్టాదారు పాస్ పుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్ పుస్తకాలు తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాలకు ఉన్న తేడా రైతులు అర్థం అయ్యేలా మంత్రి వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాసు పుస్తకాలు చెల్లని నోటుతో సమానమని అన్నారు. తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాలు రిజర్వ్ బ్యాంక్ జారీ చేస్తున్న కరెన్సీ నోటుతో సమానమని భద్రతాపరంగా చట్టబద్ధత కలిగినవని అన్నారు. రైతుల భూహక్కులకు చట్టబద్ధత భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వల్లూరు కేశవ చౌదరి, అనంతసాగరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఉప్పలపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వల్లూరు శ్రావణి, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వేలూరు రేవతి, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యదర్శి మునగపాటి సునీత సుబ్బరాజు, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బొర్రా బాబు, అనంతసాగరం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మెట్టుకూరు మనోజ్ కుమార్ రెడ్డి, లింగంగుంట గ్రామ ఉపసర్పంచ్ మెట్టుకూరు సుబ్బారెడ్డి మెట్టుకూరు సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గిరినాయుడు, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు : డీఏఓ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసు కొంటున్నామని జిల్లా వ్యవసాయాధికారిణి సత్య వాణి పేర్కొన్నారు. యురియా అందుబాటులో లేదని శుక్రవారం ఉదయగిరి వ్యవసాయ కార్యా లయం ఎదుట మండలంలోని గుడినరవ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని స్థానిక అధికారుల ద్వారా తెలుసుకున్న ఆమె గుడినరవ గ్రామానికి వెళ్లి రైతుసేవా కేంద్రం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడినరవ రైతుసేవా కేంద్రానికి 18 టన్నుల యూరియా సరఫరా చేస్తున్నామని, సోమవారం నుంచి రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఉదయగిరి సొసైటీలో సైతం యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. రైతులు ఎకరాకు ఒక బస్తా మాత్రమే యూరియా వాడాలన్నారు. పంట సాగు చేసిన 30 రోజుల్లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. ఈ సంఖ్య ఆధారంగానే రాబోయే రోజుల్లో ప్రభుత్వ రాయితీ పథకాలు అందుతాయన్నారు. కావున రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకంతో రైతుసేవా కేంద్రానికి వెళ్లి విశిష్ట సంఖ్య పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, చెన్నారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాపూరు ఏఎంసీ చైర్ పర్సన్

# ఉన్నారా.. లేరా.?

### నియామకం సరే.. ప్రమాణ స్వీకారం ఎప్పుడు.?




**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రాపూరు అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్‌గా నియామకం చేసినప్పటికీ నేటి కూడా ప్రమాణ స్వీకారానికి నోచుకోలేదు. మెట్ట ప్రాంతమైన రాపూరు ప్రాంత రైతులకు అందుబాటులో లేకపోవడం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం రాపూర్ ఏఎంసి చైర్ పర్సన్‌గా సైదాపురం మండలానికి చెందిన ఆవుల వాణిని నియమించింది. కానీ అప్పటినుండి నేటికి కూడా ఆమె ప్రమాణ స్వీకారం చేయలేదు. ఏఎంసి అధ్యక్షురాలుగా పదవీ బాధ్యతలు చేపట్లేదు. దీంతో అసలు చైర్ పర్సన్ ఉన్నారా.? లేరా.? వస్తారా.? రారా.? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రాంతంలో నిమ్మ, వరి, మినుము, ఇతర వాణిజ్య పంటలు పెడుతున్న నేపథ్యంలో చైర్ పర్సన్ అందుబాటులో లేకపోవడంతో రైతులకు సహాయ సహకారాలు అందించే సేవా కార్యక్రమాలు కుంటుపడ్డాయి. రైతులు వారి వారి సమస్యలను, ఇబ్బందులను చెప్పుకునేందుకు చైర్ పర్సన్ అందుబాటులో లేకపోవడంతో అసలు చైర్పర్సన్ ఉన్నారా.? లేరా.? చైర్పర్సన్ ఎవరు.? అనేది తెలియకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

## ఏర్పాట్లు పర్యవేక్షించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 52 డివిజన్ రంగనాయకుల పేట తిక్కన పార్క్ సమీపంలోని పెన్నా నది తీరంలో జరుగుతున్న ఏటి పండుగ ఏర్పాటు పనులను అధికారులతో కలిసి శనివారం పర్యవేక్షించారు. ప్రణాళిక బద్ధంగా పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఏటి పండుగకు పెద్ద సంఖ్యలో విచ్చేసే మహిళలు, చిన్నారులు పెన్నా నది నీటిలో లోతు ప్రాంతాలకు వెళ్లకుండా రక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఏటి పండుగను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామచంద్రుల కనుమ గరుడసేవ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని శ్రీకొలనులో సంక్రాంతి సందర్భంగా గౌడ్ సంఘం ఆధ్వర్యంలో కనుమ పండుగరోజు శ్రీరామచంద్రుల స్వామి వారిని గరుడ వాహనంపై వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా గరుడ వాహనాన్ని శ్రీ శ్రీరామ చంద్రుల స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం గరుడ వాహనంపై సర్వలాంకార భూషితుడైన శ్రీరామచంద్రుల స్వామి వారిని మంగళ వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ, కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతులతో గ్రామ పురావీధులలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రశాస్తయ్యం మైన ఈ వేడుకలో స్వామివారి తిరునామం ధరించి భక్తులు, గ్రామ ప్రజలు, అశేషంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తిరునామం సేవ నెల్లూరు శ్రీ వెంకటేశ్వర భక్తి మండలి వారు, గౌడ్ సంఘం కమిటీ సభ్యులు, పాల్గొని ఘనంగా స్వామి వారి గరుడ సేవ గ్రామోత్సవం నిర్వహించారు.

## లీకేజీని పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. అండర్ బ్రిడ్జి ప్రాంతంలో లీకేజీల ద్వారా నీరు విడుదల అవుతూ రోడ్డుపై చేరి ఉండటాన్ని కమిషనర్ గమనించి అందు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని నీటి లీకేజీ ఆగేలా పనులను చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.